నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 13 ఆగస్టు 2024 | BHADRADRI KOTHAGUDEM

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

గ్రీవెన్స్‌లో భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు

గ్రీవెన్స్ డేలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 12 : బాధితుల ఫిర్యాదులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో భాగంగా బాధితుల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యల సత్వర పరిష్కారానికి తక్షణమే విచారణ చేపట్టి వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌లో ఏడుగురు బాధితులు అర్జీలను అందజేశారు. ఇందులో నలుగురు బాధితులు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో తమ ఫిర్యాదుల మేరకు నమోదైన కేసులలో జాప్యం జరుగకుండా విచారణ జరిపించి న్యాయం చేయాలని విన్నవించారు. ఒక బాధితురాలు తనను, తన పిల్లలను మూడేళ్లుగా తన భర్త పటించుకోవడం లేదని, తనకు న్యాయం జరిగేలా చూడాలంటూ ఫిర్యాదు చేసింది. మరో ఇద్దరు బాధితులు ఇటీవల తమ ఇళ్లలో జరిగిన చోరీ కేసులో పోగొట్టుకున్న సొత్తును త్వరితగతిన రికవరీ చేసి ఇప్పించాలంటూ ఎస్పీని కోరారు.

నిర్వాసితులకు మొండిచేయి

- గుట్టుచప్పుడు కాకుండా ఎస్‌అండ్‌పీసీ ప్రైవేటు సెక్యూరిటీ నియామకాలు
- ప్రభావిత ప్రాంతాల యువతను విస్మరించి అనుయాయులకు అందలం
- తమ కోటాల పేరిట తమ వారికే ఉద్యోగాలిప్పిస్తున్న ప్రజాప్రతినిధులు
- పారదర్శకత, ప్రజాభిప్రాయంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం

రామవరం, ఆగస్టు 12 : మైనింగ్ కార్యకలాపాలను విస్తరించే విషయంలోనూ, నిర్వాసితులకు న్యాయం చేసే అంశంలోనూ సింగరేణి సంస్థ ఎంతో పారదర్శకంగా వ్యవహరిస్తుంటుంది. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాలు చేపట్టి ప్రజల ఆమోదం తీసుకున్న తరువాతే ముందుకు సాగుతూ ఉంటుంది. నిర్వాసితులకు తగిన ఉపాధి కల్పిస్తూ, ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి పాటుపడుతూ ప్రజల విశ్వాసం పొందుతూ ఉంటుంది. కానీ.. తాజాగా కొందరు ఉద్యోగులు, ఇతరుల కారణంగా చోటుచేసుకుంటున్న కొన్ని పరిణామాలు సంస్థపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా ఉంటున్నాయి. ఎస్‌అండ్‌పీసీ ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల నియామకం విషయంలో ఇటీవల జరిగిన పరిణామాలు ఇందుకు దోహదం చేస్తున్నాయి.

నోటిఫికేషన్ లేకుండా నియామకాలు

సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని సంస్థ ఆస్తులను కాపాడేందుకు, ఉద్యోగులకు రక్షణగా ఉండేందుకు ఎస్‌అండ్‌పీసీ ద్వారా ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల నియామకం కూడా చేపడుతారు. టెండరు దక్కించుకున్న సెక్యూరిటీ ఏజెన్సీ.. ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల నియామకాలను చేపడుతుంది. ఈ నియామకాల్లో భాగంగా ఇటీవల 18 పోస్టులకు గాను.. 26 మందిని(స్టాండింగ్ కోసం ఎక్కువ మందిని తీసుకుంటారు) ఎంపిక చేశారు. అయితే ఇలాంటి ఎంపికల కోసం గతంలో నోటిఫికేషన్ ఇచ్చేవారు. ప్రొఫెసర్ జయశంకర్ మైదానంలోగానీ లేదా ప్రగతి వనంలోగానీ సింగరేణి అధికారుల పర్యవేక్షణలో అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించేవారు. ఈ ప్రక్రియనంతా పూర్తి పారదర్శకంగా చేపట్టేవారు. కానీ.. ఇటీవలి అంశంలో నోటిఫికేషన్ లేకుండానే నియామకాలు చేపట్టారు. 5 షాప్టుకు వెళ్లే దారిలో గుట్టుచప్పుడు కాకుండా దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ అంశాలు ప్రభావిత ప్రాంతాల్లోని నిర్వాసితుల్లో అనేక అనుమానాలను పెంచుతున్నాయి. అయితే ఈ నియామకాల్లో స్థానిక ప్రజాప్రతినిధికి 17 పోస్టులు, వైరా ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధికి 5 పోస్టులు, స్థానిక నాయకులకు మిగతా పోస్టులను కేటాయించినట్లు విశ్వసనీయమైన సమాచారం. ఇందులోనూ ఒకే సామాజికవర్గం వారికి పెద్దపీట వేసినట్లు ఆరోపణలున్నాయి. అదీగాక ఎస్‌అండ్‌పీసీలో పనిచేసే ఆ సామాజిక వర్గానికి చెందిన ఓ వ్యక్తి ఈ సెక్యూరిటీ ఏజెన్సీని ప్రభావితం చేస్తున్నాడని, తద్వారా తాను కూడా లబ్ధిపొందుతున్నాడని ఆరోపణలున్నాయి. అయితే ప్రజలకు న్యాయం చేయాల్సిన ప్రజాప్రతినిధులే తమ కోటాల పేరిట ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అన్యాయం చేస్తున్నారని, తమ అనుయాయులకే ఉద్యోగాలిప్పిస్తూ వారినే అందలం ఎక్కిస్తున్నారని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు.

కొత్తగూడెం ఏరియా ఎస్‌అండ్‌పీసీ కార్యాలయం

ఐఈడీ ప్రకారం ఖాళీలు లేవు : శ్రీనివాస్, కొత్తగూడెం ఎస్ఎస్‌వో

ఐఈడీ లెక్కల ప్రకారం ఖాళీలు లేవు. ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ఒత్తిడితోనే సంబంధిత కాంట్రాక్టర్ ఈ నియామకాలు చేపట్టారు.

నిరుద్యోగులకు అన్యాయమే జరిగింది..

ఎస్‌అండ్‌పీసీ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకాల్లో ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగులకు అన్యాయమే జరుగుతోంది. గతంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగినప్పుడు కూడా ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకొచ్చాం. అయినా ఉపయోగం లేకుండా పోతోంది. గతంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టేవారు. ప్రభావిత ప్రాంతాల యువతకు మాత్రమే అవకాశం ఇచ్చేవారు. ఇప్పుడు జరుగుతున్న నియామకాల్లో ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగ యువత లేనేలేదు. అందరూ ఇతర ప్రాంతాల వాళ్లే.

–గుమ్మడి సాగర్, మాజీ సర్పంచ్, రుద్రంపూర్

ప్రతిసారీ మొండిచేయి చూపుతున్నారు..

ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ప్రతిసారీ మొండిచేయే చూపుతున్నారు. ఇక్కడి ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో చెబుతున్న అధికారులు.. ఆ తరువాత మా అభిప్రాయాలను పట్టించుకోవడమే లేదు. మా తండా నుంచి ఐదుగురికి అవకాశమివ్వాలని గతంలో అధికారులను అనేకసార్లు అభ్యర్థించాం. కాలయాపనే తప్ప ప్రయోజనం కన్పించలేదు. ప్రభావిత గ్రామాలకు సంబంధం లేనివారే ఇక్కడ ఉద్యోగాలు చేస్తున్నారు.

–బానోత్ రాందాస్, మాజీ సర్పంచ్, ధన్వాడ

'సీతారామ' ఘనత కేసీఆర్‌దే..

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

- ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ చేసేందేమీ లేదు
- పథకాలకు నిధులిచ్చే సత్తా లేని సర్కారు
- మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

ములకలపల్లి, ఆగస్టు 12 : ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడానికి భద్రాద్రి రామయ్య పేరుతో గత సీఎం కేసీఆర్ సీతారామ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని, దీనికి ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని, ఇదంతా ప్రజలకు తెలుసని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రయల్ రన్ సందర్భంగా మంత్రులు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మెచ్చా మాట్లాడుతూ కేసీఆర్‌ను విమర్శించే అర్హత జిల్లాలోని ముగ్గురు మంత్రులకు లేదని, మీకు చేతనైతే ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వమే అంతా చేస్తే.. ఇప్పుడు మీరు వచ్చి స్విచ్ ఆన్ చేస్తే నీళ్లు వస్తున్నాయా.. అని ఆయన ప్రశ్నించారు. పథకాల అమలుకు నిధులు ఇచ్చే సత్తా మీకు లేదని ప్రజలకు ఎప్పుడో అర్థమైందన్నారు.

రుణమాఫీకి కొర్రీలు..

రైతులకు రైతు భరోసా ఊసే లేదని, రుణమాఫీకి కొర్రీలు పెట్టి 15 శాతం రైతులకు కూడా మాఫీ చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. వరద లొచ్చి నియోజకవర్గ ప్రజలు అవస్థలు పడుతుంటే.. ఎమ్మెల్యే మాత్రం దుబాయ్ టూర్‌లో ఎంజాయ్ చేస్తున్నాడని, పెదవాగు ప్రాజెక్టు కొట్టుకుపోతే నెల రోజులైనా పట్టించుకునే దిక్కులేదన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి పీహెచ్‌సీకి నూతన భవనం నిర్మించి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదన్నారు. నియోజకవర్గంలోని ప్రజోపయోగ పనులన్నీ అర్థంతరంగా నిలిపివేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ సున్నం నాగమణి, పార్టీ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, నాయకులు మెహ్రామని, సీతారాములు, హనమంతు, రాజేశ్, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల ఆందోళన

అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని దీక్ష

మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన జీపీ కార్మికులు

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 12 : అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గ్రామపంచాయతీ కార్మికులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఒకరోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల నిర్వహణలో కార్మికులది కీలక పాత్ర అని అన్నారు. ప్రజల అవరాలను తీరుస్తూ.. పారిశుధ్య నిర్వహణను సమర్థవంతంగా నిర్వహిస్తున్నా.. వారి సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. జీవో నెంబర్ 51ని వెంటనే సవరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, విధి నిర్వహణలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారంగా రూ.10 లక్షలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో వెంకటప్పయ్య, నర్సింహారావు, ముత్తారావు, నాగభూషణం, మహేశ్ పాల్గొన్నారు.

మణుగూరు డిపో ఎదుట..

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల నిరసన

- మద్యం అలవాటు లేనివారు మద్యం తాగినట్లు చూపుతున్న బ్రీత్ అనలైజర్లు
- రీ టెస్ట్‌కు ససేమిరా అంటూ పలువురు డ్రైవర్లను సస్పెండ్ చేసిన అధికారులు
- తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ బస్సులు నిలిపి డ్రైవర్ల నిరసన
- 76 మంది ఆందోళన.. 32 బస్సుల నిలుపుదల.. ప్రయాణికుల ఇక్కట్లు..

మణుగూరు ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

మణుగూరు టౌన్, ఆగస్టు 12: మద్యం అలవాటు లేనివాళ్లు కూడా మద్యం తాగినట్లు చూపుతున్న బ్రీత్ అనలైజర్‌ను మార్చకుండా డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేయడం సరికాదంటూ ఆర్టీసీ మణుగూరు డిపో అద్దె బస్సు డ్రైవర్లు, సిబ్బంది ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఉదయం నుంచి వారు నిరసన చేపట్టి బస్సులను బయటకు తీయలేదు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మద్యం అలవాటు లేనివారు కూడా మద్యం తాగినట్లు బ్రీత్ అనలైజర్ చూపుతోందని, ఈ కారణంగా అధికారులు ఇటీవల ముగ్గురు కార్మికులకు సస్పెండ్ చేశారని అన్నారు. మద్యం అలవాటు లేని తమకు మరోసారి టెస్ట్ చేయాలని డ్రైవర్లు కోరినా.. నిబంధనలు ఒప్పుకోవంటూ అధికారులు వారిని సస్పెండ్ చేయడం తగదని అన్నారు. కాగా, వీరి ఆందోళనకు ఇప్టూ నాయకుడు మిడిదొడ్ల నాగేశ్వరరావు సంఘీభావం తెలిపారు. ఫలితంగా 32 ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. రెండు షిఫ్టులకు చెందిన 76 మంది సిబ్బంది ఈ నిరసనలో పాల్గొన్నారు. ఉదయం కదలాల్సిన బస్సులు డిపోలోనే ఉండిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సీఐ చొరవతో సమస్య పరిష్కారం..

విషయం తెలుసుకున్న మణుగూరు సీఐ సతీశ్‌కుమార్, ఎస్ఐ మేడ ప్రసాద్.. నిరసన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లతో చర్చించారు. ఉదయం నుంచీ నిలిచి ఉన్న బస్సులను ఉదయం 10 గంటల సమయంలో పునరుద్ధరించారు. అనంతరం ఆర్టీసీ డీఎం శ్యాంసుందర్‌తోపాటు డ్రైవర్లతో మాట్లాడారు. ఆర్టీసీ అధికారులు బ్రీత్ అనలైజర్ మిషన్‌ను మార్చాలని, మద్యం అలవాటు లేని కార్మికులు అభ్యంతరం వ్యక్తం చేస్తే ఉన్నతాధికారులతో చర్చించి మరోసారి టెస్ట్‌కు అనుమతివ్వాలని సూచించారు. అలవాటులేని ఓ కార్మికుడిని సస్పెండ్ చేసిన అంశంపై పునరాలోచన చేయాలని కోరారు. దీనికి ఆర్టీసీ డీఎం శ్యాంసుందర్ స్పందిస్తూ.. ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు నిరసన విరమించారు.

టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం సిద్ధం

- ఖమ్మంఖిల్లాపై త్వరలో రోప్‌వే నిర్మిస్తాం..
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- ఖిల్లాది వెయ్యేండ్ల చరిత్ర : మంత్రి తుమ్మల
- టూరిజం హబ్‌గా ఉమ్మడి ఖమ్మంజిల్లా : మంత్రి జూపల్లి

ఖమ్మం ఖిల్లాను పరిశీలిస్తున్న మంత్రులు భట్టి, తుమ్మల, జూపల్లి, ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం/ కూసుమంచి (నేలకొండపల్లి)/ పాల్వంచ రూరల్/ వైరా టౌన్, ఆగస్టు 12: తెలంగాణ రాష్ట్రాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసి ప్రపంచపటంలో స్థానం కల్పిస్తామని, ఇందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని ఖిల్లాని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ పర్యాటకరంగం అభివృద్ధికి ఎన్ని నిధులైనా కేటాయిస్తామన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో ఖిల్లాకు రోప్‌వే కావాలన్న డిమాండ్ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందన్నారు. రోప్ వే నిర్మాణానికి అనుమతులు ఇస్తూ మంత్రి జూపల్లి సంతకాలు చేశారని, త్వరలోనే పనులు ప్రారంభించి కొద్దినెలల్లోనే అందుబాటులోకి తెస్తామని తెలిపారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం ఖిల్లా వెయ్యేండ్ల చరిత్ర గల చారిత్రక కట్టడమని అన్నారు. రోప్ వే వేస్తే తప్ప ఖిల్లాలో విహారానికి అవకాశం లేదన్నారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ అంతర్జాతీయ పర్యాటకులను రాష్ట్రానికి రప్పించడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని, ఖమ్మంఖిల్లాపై ఒక కిలోమీటరు మేర సుమారు రూ.30 కోట్లతో రోప్ వే నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. అంతకుముందు మంత్రులు నేలకొండపల్లి మండలం మజ్జిగూడెం గ్రామంలోని బౌద్ధ స్తూపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బౌద్ధస్తూపం 1వ శతాబ్దంలోనిదని, 8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దీన్ని అభివృద్ధి చేస్తే గొప్ప పర్యాటకప్రాంతంగా మారుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, టూరిజం అభివృద్ధి సంస్థ చైర్మన్ రమేశ్‌రెడ్డి, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా, కమిషనర్ అభిషేక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా టూరిజం అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా పాల్వంచ మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన కిన్నెరసానిని మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పర్యటించారు. రిజర్వాయర్‌లో ప్రత్యేక బోటులో విహరించి కిన్నెరసాని అందాలను తిలకించారు. బోటింగ్ పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మట్టా రాగమయి, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేశ్, ఐటీడీఏ పీవో రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజు తదితరులు పాల్గొన్నారు. వైరా రిజర్వాయర్‌ను కూడా డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి జూపల్లి సోమవారం రాత్రి సందర్శించారు. పర్యాటక అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

మృతిచెందిన ఉద్యోగులకు నివాళులర్పిస్తున్న నాయకులు

పాల్వంచ, ఆగస్టు 12 : ఉద్యోగులు ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని తెలంగాణ సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా జేఏసీ అధ్యక్షుడు భూక్యా మోహన్, ప్రధాన కార్యదర్శి భట్టు చందర్‌లాల్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల సమగ్రశిక్షలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగులకు పాల్వంచ మండలం విద్యావనరుల కేంద్రంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్రశిక్షలో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేదని, తక్కువ వేతనాలతోపాటు పని ఒత్తిడి పెరగడం, పెరిగిన నిత్యావసర ధరలతో కుటుంబ పోషణ భారం కావడంతో నిరాశా నిస్పృహలకు లోనై గుండెపోటుతో ప్రతీ నెలకు ఇద్దరు చొప్పున మృతిచెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన నెల రోజుల్లో ఖమ్మం జిల్లాలో కే.దాసు, రంగారెడ్డిలో టీవీపీఎస్ ప్రసాద్, నారాయణపేట జిల్లాలో వెంకట్ రాములు, ఆదిలాబాద్‌లో మమత గుండెపోటుతో మృతిచెందారని తెలిపారు. సమగ్రశిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని, బేసిక్ పే అమలు చేయాలని, ఆరోగ్య బీమా రూ.5 లక్షలు, జీవిత బీమా రూ.10 లక్షలు, ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ.10 లక్షల చొప్పున ప్రయోజనం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గెజిటెడ్ హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంవీఎల్, పీఆర్‌టీయూ నుంచి సంఘమేశ్వరరావు, పూర్ణచందర్‌రావు, రాంబాబు, రమేశ్ రాథోడ్, కిరణ్మయి, అర్జున్, దుర్గ, కిషన్, ప్రవీణ్, ప్రభాకర్, అనిత, తులసి, గంగరాజు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వండి

- ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్

గిరిజన దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్

బూర్గంపహాడ్, ఆగస్టు 12 : మారుమూల ప్రాంతాల నుంచి వచ్చి బాధితులు సమర్పించిన అర్జీలను పరిశీలించి ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం భద్రాచలం ఐటీడీఏ మందిరంలో పీవో రాహుల్ ఆదేశాల మేరకు గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను విన్నవించేందుకు వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల గిరిజనులు సమర్పించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కాగా.. పోడు భూములకు పట్టాలు, పట్టాల్లో పేరు మార్పు, రైతుబంధు రుణాలు, వ్యక్తిగత, భూ సమస్యలు, విద్య కోసం ఆర్థిక సాయం, గిరిజన గ్రామాల్లో వ్యవసాయ సాగుకు విద్యుత్, బోరు, మోటరు, మంచినీటి సౌకర్యం, కొత్తగా మత్స్యకార సొసైటీల ఏర్పాటు తదితర అంశాలపై అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో గురుకులం ఆర్సీవో నాగార్జునరావు, డీఎంజీసీసీ దావీద్, ఏడీ అగ్రికల్చర్ భాస్కర్, కొండరెడ్ల అధికారి నరేశ్, ఏపీవో పవర్ మునీర్‌పాషా, డీటీ ఆర్‌వోఎఫ్ఆర్ శ్రీనివాస్, ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్, మేనేజర్ ఆదినారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ పర్యవేక్షకురాలు ప్రమీలాబాయి, మిషన్ భగీరథ ఏఈ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

అధికారుల సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, ఆగస్టు 12 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సీఎం పర్యటనపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి భద్రాద్రి జిల్లాలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రారంభోత్సవం తర్వాత వైరాలో 50 వేల మంది రైతులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ మేరకు ఈ నెల 14న సీనియర్ అధికారులు, మంత్రులు జిల్లాకు రానున్నారని, వారికి వసతి ఏర్పాట్లలో లోటు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. 15న కలెక్టరేట్, పరేడ్ గ్రౌండ్స్‌లో పతాకావిష్కరణ తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు, అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు. 200 మందితో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, వాహనాల కోసం నాలుగు చోట్ల పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డి.మధుసూదన్‌నాయక్, ఇన్‌చార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో సన్యాసయ్య, డీఆర్వో రాజేశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీలను పరిష్కరించండి : అదనపు కలెక్టర్

వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

మామిళ్లగూడెం, ఆగస్టు 12 : అర్జీలను పరిశీలించి వెనువెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అధికారులకు సూచించారు. గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కామేపల్లి మండలం మర్రిగూడెం, జాస్తిపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన కిలారి కల్పన, కొణిజర్ల మండలం చిన్నమునగాలకు చెందిన బాధితులు తమ తమ సమస్యలపై వినతులు సమర్పించారు. అలాగే రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు మండలాల తహసీల్దార్లు తీసుకున్న చర్యల నివేదికను శుక్రవారం వరకు పంపించాలని ఆదేశించారు. వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి సమస్యలను ఆయా శాఖల జిల్లా అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.